తెలుగు దిన పత్రిక
ప్రజా జ్యోతి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
ఖమ్మం
గురువారం 30-5-2024
పేజీలు :8



## మన లీడర్ మన రవన్న బ్రోచర్ ఆవిష్కరణ

**ఖమ్మం మే 29 ప్రజా జ్యోతి.:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సేవాతత్పరత, మంచితనాన్ని కొనియాడుతూ ప్రముఖ రచయిత కందకట్ల రామకృష్ణ "మన లీడర్-మన రవన్న"అనే పాట రాశారు.ఈ పాటను మైదం జ్యోత్న్న,ఎం.డీ.రహీమల సహకారంతో ప్రముఖ గాయకుడు ఇనుగుర్తి(ఓరుగంటి)మధు పాడారు.ఈ సందర్భంగా రూపొందించిన బ్రోచర్ ను బుధవారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మధు,ఆయన మిత్రులు క్రాంతి కుమార్,దీపక్ తదితరులను ఎంపీ రవిచంద్ర అభినందించారు.అలాగే, ఎంపీ వద్దిరాజు మెగా కమల ఏరోబిక్స్%డ%డాన్స్ ఫ్లోర్ 9వ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు.హనుమకొండ అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో జూన్ 8,9వతేదీలలో జరిగే వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా క్రాంతి కుమార్ ఆహ్వానించగా,అందుకు ఎంపీ రవిచంద్ర సానుకూలంగా స్పందించారు.

# పాఠశాలల పునః ప్రారంభంలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల లో పనులన్నీ పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ వి పి గౌతం



**ఖమ్మం ప్రతినిధి మే 29 ప్రజా జ్యోతి.:** పాఠశాలల పునఃప్రారంభం లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులన్నీ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్, రఘునాథపాలెం మండలం వేపకుంట్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మం నగరం రాపర్తినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బురహాన్ పురం విద్యానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం కొత్తూరు (వై), చిన్న తాండ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల క్రింద మంజూరు నిధులు, చేపట్టిన పనులు, పూర్తి చేసిన పనులు, ఇంకనూ చేయాల్సిన పనులు, పూర్తికి సమయం అడిగి తెలుసుకున్నారు. రన్నింగ్ వాటర్ తో నూతన టాయిలెట్లు, టాయిలెట్ల మరమ్మత్తులు, పాఠశాల గదుల చిన్న చిన్న మరమ్మత్తులు, త్రాగునీరు, విద్యుత్ పనులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, పెయింటింగ్ తదితర పనులు పూర్తి కావాలన్నారు. పాఠశాల ఆవరణలో, ప్రవేశం దగ్గర వెలుతురు వుండేలా వీధి లైట్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటుచేసి, వారికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన పనులు అప్పగించిందని అన్నారు. అన్ని మౌళిక సదుపాయాలతో పాఠశాలలకు కొత్త హంగులు సమకూరుతున్నాయన్నారు. బడి బాట కార్యక్రమాన్ని గొ ప్ప గా చేపట్టి, నమోదులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, భోజనం, యూనిఫామ్ లు అందిస్తున్నట్లు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అంతకుముందు కలెక్టర్, రఘునాథపాలెం మండలం, వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ని పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ అప్పగించింది, ఎంతమేర పూర్తి చేసింది అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన యూనిఫామ్ లను పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం లోగా విద్యార్థులందరికీ యూనిఫామ్ అందేలా చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డిఆర్డీవో సన్యాసయ్య, డిఇఓ సోమశేఖరశర్మ, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## రేషన్ కార్డులు, కొత్త పెన్షన్ల పై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన ఖమ్మం



**ప్రతినిధి మే 29 ప్రజా జ్యోతి.:** రాష్ట్రంలో రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎప్పటి నుంచో ఆగిపోయి ఉన్న రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడం జరుగుతుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. విషయాన్ని మంత్రి ఎక్స్(ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఈ మేరకు మంత్రి ప్రకటించారు. అర్హులందరికీ కొత్త పెన్షన్లు కూడా ఇస్తామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీ లోగా రైతు రుణమాఫీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో పాఠశాలలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతామని ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి ట్వీట్ చేశారు.

## లోక్సభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్

**ఖమ్మం ప్రతినిధి మే 29 ప్రజా జ్యోతి** లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్ల గురించి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోకసభ సాధారణ ఎన్నికల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సామాగ్రి, స్టేషనరీ సేకరణ పూర్తి చేయాలన్నారు. లెక్కింపు అనంతరం ఇవిఎం యంత్రాలను ఇవిఎం గోడౌన్ కు తరలింపు ప్రక్రియకు వాహనాల, కూలీల ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు విధుల సిబ్బంది, పోలీసు సిబ్బంది కి అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. పబ్లిక్ కమ్యూనికేషన్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్నారు. మీడియా కేంద్రం ఏర్పాటుచేసి, ఫలితాల ప్రదర్శనకు ఎల్ఇడి స్క్రీన్, సమాచారం కొరకు టెలివిజన్ల ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన విధంగా బ్యారికెటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు, సిబ్బంది, ఏజెంట్లకు పాసుల జారీచేయాలన్నారు. సెగ్మెంట్ల వారిగా ఫలితాల చేరవేతకు లైజన్ అధికారుల నియామకం చేయాలన్నారు.

## పిండిప్రోలు లో వీధి కుక్కల హల్చల్

**కుక్క కాటు తో ఐదుగురికి తీవ్ర గాయాలు**



**తిరుమలాయపాలెం, మే 29, ప్రజా జ్యోతి :** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో వీధి కుక్కలు హల్చల్ చేస్తూ ఐదుగురు వ్యక్తులను గాయపరిచిన సంఘటన బుధవారం జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి పిండిప్రోలు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోలే బోయిన వీరబాబు ఇంట్లో నుండి బజారుకు నడిచి వస్తుండగా ఒక్కసారిగా వీధి కుక్క మీద పడి కాటు వేసి గాయపరిచింది వీరబాబు తో పాటు మరో నలుగురు వ్యక్తులను కుక్క కాటు వేసి గాయపరిచింది దీంతో గ్రామం లో చిన్నపిల్లలు ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు గ్రామాలలో వీధి కుక్కలను పట్టి కుక్కల సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

# గొర్రెలు,మేకలకు చిటిక వ్యాధి టీకాలు



**బోనకల్,మే 29,ప్రజా జ్యోతి:** మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలో గొర్రెలు,మేకలకు ఈటి చిటిక వ్యాధి టీకాలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలో భాగంగా చిటిక వ్యాధి టీకాలు కార్యక్రమంను ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అన్వేష్,సిబ్బంది నాగేంద్ర కుమార్, శ్రీకాంత్,నాగేశ్వరావు,త్రివేణి,గ్రామంలోని గొర్రెల కాపరులు మరి నాగేశ్వరావు,మర్రి సుధాకర్, మల్లాది తిరుపయ్య, దిద్దుకూరి మంగయ్య,మంద ఉపేందర్,పదిరం నరసింహ పాల్గొన్నారు.

## సీనియర్ కరాటే మాస్టర్ ఎం.ఏ గఫూర్ ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ లో గెలుపొందిన సందర్భంగా శాలువాతో ఘన సత్కారం.

**ఖమ్మం మే 29 ప్రజా జ్యోతి :** కుశనో - హ ఓపెన్ ఇన్విటేషనల్ ఛాంపియన్షిప్ మలేషియా లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి 10 మంది మాస్టర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది . 55-60 ఏజ్ గ్రూపులో ఖమ్మం నుండి ఎం.ఏ గఫూర్ కటా విభాగంలో ఇండియా వర్సెస్ జపాన్ కటా విభాగంలో జపాన్ వారిపై పోటీలలో గెలుపొంది వెండి పథకాన్ని సాధించారు . స్టార్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే విద్యార్థిని విద్యార్థులు మరియు సీనియర్ స్టూడెంట్ సంతోష్ కుమార్ తమ గురువు ను ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ లో గెలుపొంది నందుకు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు .

# జర్నలిస్టు తమ్మిశెట్టి వైద్యానికి రూ.10 వేల ఆర్థిక సహాయం.

- తక్షణమే స్పందించిన టీయూడబ్ల్యూయుజె (టీజేఫ్)
- తమ్మిశెట్టి ఆరోగ్య పరిస్థితిపై అల్లం నారాయణ వాకబ్



**ఖమ్మం మే 29 ప్రజా జ్యోతి.:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో ఖమ్మంలోని శ్రీకృష్ణ హాస్పిటల్ లో అపస్మారక స్థితిలో అడ్మిట్ అయ్యారు. ఆయన అనారోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని టీయూడబ్ల్యూయుజెజె (టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు ...తమ్మిశెట్టి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన సతీమణి రమాదేవికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. తమ్మిశెట్టి ఆరోగ్య పరిస్థితిపై అల్లం నారాయణ వాకబ్ అలాగే ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ టీయూడబ్ల్యూయుజె వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్,జాయింట్ సెక్రెటరీ మేకల కళ్యాణ్ చక్రవర్తి తమ్మిశెట్టి ఆరోగ్య పరిస్థితిపై వాకబ్ చేశారు. జిల్లా నాయకత్వం హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి వెంకటేశ్వర్లు ఆరోగ్యం మెరుగు పడేలా చూసుకోవాలని కోరారు.

# దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం

**కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నం రాజశేఖర్**



**తిరుమలాయపాలెం, మే 29, ప్రజా జ్యోతి :** పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి భారతదేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నం రాజశేఖర్ తెలిపారు బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీ కుటుంబం మొదటి నుంచి దేశానికి ఎన్నో త్యాగాలు చేసిందని దేశం కోసం ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారని అలాంటి కుటుంబం నుండి వచ్చిన యువనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతున్నారని తెలిపారు భారతదేశంలోని పేద, మధ్యతరగతి రైతులు మహిళలు, యువతి యువకుల సమస్యలు తెలుసుకోవడానికి భారత్ జూడో యాత్ర నిర్వహించి దేశమంతటా పాదయాత్ర చేసిన తొలి వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని తెలిపారు నిరుపేదలు రైతులు మహిళలు నిరుద్యోగులకు న్యాయం చేయాలని భారత్ న్యాయ్ యాత్ర చేపట్టిన వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆయన అన్నారు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశంలో రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేస్తుందన్నారు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం నల్లధనాన్ని వెలికి తీస్తామని అందుకే నోట్ల రద్దు కార్యక్రమం చేపట్టి దేశ ప్రజలకు ప్రతి ఒక్కరికి బ్యాంకు అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం డబ్బులు వేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మాత్రం లక్షల కోట్ల రుణమాఫీ చేస్తుంది కానీ రైతులకు మాత్రం రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం పైన ఆర్థిక భారం పేరుతో రైతులకు అన్యాయం చేస్తుందని తెలిపారు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే కేంద్రంలో కూడా ఇలాంటి ఫలితాలు పునరావృతం కావడం ఖాయమని ఆయన అన్నారు.

# మృత్యువాత పడిన గొర్రెల బాధితులకు పరామర్శ

**గొర్రెల బాధితులకు ప్రభుత్వం తక్షణమే సహాయం చేయాలి**

**డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, దుబాకుల శ్రీనివాసు యాదవ్**



**తిరుమలాయపాలెం, మే 29, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండలం రాజారం లో ఇటీవల కలుపు మందు కొట్టిన పెసర చేలో మేత మేసి అమాయక మూగజీవాలైన గొర్రెలు దాదాపు 200కు పైగా మృత్యువాత పడిన విషయం విదితమే. బుధవారం రోజు అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, రాష్ట్ర నాయకులు దుబాకుల శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండలం గొర్రెల సంఘం అధ్యక్షులు దొడ్డి సాంబయ్య గొర్రెల బాధితులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ, రసాయనిక మందులు వాడిన చేనులోకి మేతకు వెళ్లి గొర్రెలు చనిపోవడం చాలా దురదృష్టకరమని కేవలం గొర్రెల వృత్తి పైన ఆధారపడి జీవించే కుటుంబాలు 30 లక్షల రూపాయలకు పైగా తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, విచారం వ్యక్తం చేశారు. గొర్రెల బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం జరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి గొర్రెకు ఇన్సూరెన్స్ పథకం ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేయకున్నట్లయితే గొర్రెలకు బీమా పథకం ద్వారా ఈరోజు బాధితులందరికీ న్యాయం జరిగేదని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం నుండి సహకారం అందించటానికి, పొంగులేటి శీనన్న ద్వారా కృషి చేస్తానని బాధితులకు మల్లిబాబు యాదవ్ హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన 559, 1016 జీవోలను పునరుద్ధరించి జీవాల మేత కొరకు చెరువు శిఖం భూములు, లోతట్టు ప్రాంతాలను సంఘాలకు అప్పగించాలని, రాష్ట్రంలోని ప్రతి గొర్రెకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గొర్రెలు మంజూరు చేయాలని మల్లి బాబు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల మల్లయ్య కొమ్ము సైదులు, పేర్ల బయన్న, పేర్ల లింగయ్య, గుండాల సైదులు, గుండాల మల్లయ్య, పేర్ల గాలయ్య, పరాల మల్లయ్య, గుండాల గంగయ్య, పేర్ల బిక్షం, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య వీరబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాలకు ఎలాంటి కొరత లేదు జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి మే 29 ప్రజా జ్యోతి:** జిల్లాలో పచ్చిరొట్టె, పత్తి విత్తనాలకు ఎలాంటి కొరత లేదని, కావాల్సినంత అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుండి జిల్లాకు 21,276 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనం కేటాయింపులు జరిగి, జిల్లాకు 14,067 క్వింటాళ్ల విత్తనం చేరుకుందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు 8,908 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనం అమ్మకం జరగగా, ఇంకనూ 5,159 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో వున్నదని, అదే కాకుండా ఇంకా విత్తనాలు వస్తాయని ఆయన తెలిపారు. జిల్లాలో వర్షాకాలంలో 2,01,834 ఎకరాల్లో పత్తి పంట సాగు అంచనా వున్నదని, ఒక ఎకరాకు 2 ప్యాకెట్ల చొప్పున పత్తి విత్తనాలు అవసరం అవుతాయని ఆయన అన్నారు. జిల్లాలో ఇప్పటికే 4,49,347 ప్యాకెట్ల పత్తి విత్తనం అందుబాటులో వున్నదని, బుధవారం నాటికి కేవలం 34,000 ప్యాకెట్ల పత్తి విత్తనాల అమ్మకం జరిగినట్లు ఆయన అన్నారు. కావున రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, కావాల్సిన దానికి అదనంగా విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ప్రశాంతంగా విత్తనాలు కొనుక్కోవచ్చని కలెక్టర్ అన్నారు.



## సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

**సత్తుపల్లి, మే 29: (ప్రజా జ్యోతి) :** వేసవి తాపం ఎక్కువగా ఉండటంతో సత్తుపల్లి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు ఉచిత మజ్జిగను అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ వెంకట రామ మాట్లాడుతూ సత్య సాయి సేవ సమితి నుండి నిరంతరం ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్నామని కాలానికి అనుగుణమైన అవసరాలు తీరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామని అన్నారు. దాతలు సహకరిస్తే సత్యసాయి సేవా సమితిని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ ఇంచార్జ్ సి.హెచ్ అనురాధ, సేవాదళ్ ఇంచార్జ్ ప్రతాప్, కోఆర్డినేటర్ రత్తయ్య, దాత కమల, నిరంతర సేవా విభాగం నరసింహారావు, రమ, పాల్గొన్నారు.

## విత్తన కొనుగోలు పై రైతులకు అవగాహన

**కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ్ చంద్ర**

**కూసుమంచి మే29 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలోని గురువాయిగూడెం పోచారం గ్రామాలలో రైతులకు నకిలీ విత్తనాల అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ విత్తనాలను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుండి మాత్రమే తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలను విక్రయిస్తున్నట్లయితే అటువంటి సమాచారాన్ని వెంటనే మండల వ్యవసాయ అధికారికి లేదా పోలీసు శాఖ వారికి తెలియజేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొన్న బిల్లును కాళీ ప్యాకెట్లను పంట కలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా పత్తి గింజలు విత్తుకోవాలంటే తగిన వర్షపాతం అనగా 60 మిల్లీమీటర్ల వర్షపాతం వచ్చిన తర్వాత మాత్రమే పత్తి గింజలను విత్తుకోవాలని లేదంటే భూమిలోని వేడికి గింజలు సరిగా మొలకెత్తవని సూచించారు. అనంతరం పచ్చి రొట్టె ఎరువుల వలన కలిగే ప్రయోజనాలు, వరి పత్తి మరియు మిరప సాగులో మెళకువలు, ఎరువుల యజమాన్యం మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రామదుగు వాణి, ఏఈవోలు ప్రియాంక సాయిరాం ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# పలువురికి ఆదర్శంగా ఫ్యామిలీ గెట్ టుగెదర్

**ప్రజాజ్యోతి - ఏన్కూర్:** ప్రతి మనిషి జీవితంలో కుటుంబం అనేది ముఖ్యమైన భాగం.నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలిసి జీవించ లేని పరిస్థితి నెలకొంది.డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే మనకుటుంబాలు ఎంతగా విచ్ఛిన్నమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరుకాపురాలు పెట్టుకొని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబంతో కలిసి మనుగడ సాగించడంలోని గొప్పతనం ఏమిటంటే మనని మనం ఎవరికీ పరిచయం చేసుకోవలసిన అవసరం లేకుండా జీవితం గడపడమే, అంటే కుటుంబవ్యవస్థకు అంత ప్రాధాన్యత ఉంది. అలాంటి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడు కోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మళ్లీ ఉమ్మడి కుటుంబాలకు జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ఈ రోజు ఏన్కూరు మండలం, నాచారం గ్రామానికి చెందిన స్వర్గీయ బానోతు కార్గి మరియు రక్లి కుటుంబానికి చెందిన సుమారు 180 మంది కుటుంబ సభ్యులు ఒకే చోట చేరి,



పలువురికి ఆదర్శంగా నిలిచారు.వృత్తి రీత్యా పోలీసులుగా,డాక్టర్, లాయర్, టీచర్, వ్యాపారులుగా, సినిమా ఆర్టిస్టులుగా, వ్యవసాయదారులుగా దేశ విదేశాలలో పలురంగాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీని కుటుంబం కోసం ఏడాదిలో రెండు రోజులపాటు సమయాన్ని కేటాయించి తమ పిల్లలు, పెద్దలు, కుటుంబ సభ్యులతో ఒకచోట చేరి, తమ అనుభవాలను పంచుకున్నారు. ముందుగా పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బంధాలకు ఉన్నటువంటి గొప్పతనాన్ని గురించి పిల్లలకు వివరించారు.ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ మీకు ఆపద వచ్చినప్పుడు అండగా మేమున్నాము అని ధైర్యాన్ని ఇస్తూ కలిసిమెలిసి సుఖసంతోషాలతో జీవించడమే వసుదైక కుటుంబం అని నిరూపించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన ప్రముఖులు కొందరు ప్రశంసలతో అభినందించారు.

# ఘనంగా టిపిటిఎఫ్ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

**కూసుమంచి మే 29 ప్రజా జ్యోతి :** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం కూసుమంచి మండల వనరుల కేంద్ర లో బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడక ముందు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ గా ఉన్న మన సంఘం రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ గా అవతరించి ఈనాటితో పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులకు తొమ్మిది సంవత్సరాల నుండి ప్రమోషన్లు, ఆరు సంవత్సరాల నుండి బదిలీలు లేక తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టీచర్స్ బదిలీలు, ప్రమోషన్లు షెడ్యూల్ను వెంటనే ప్రకటించి, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం టెట్ లేకుండా ప్రమోషన్స్ టీచర్ల బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న డిఏలు, పి.ఆర్.సి అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని.పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు ,మన ఊరు



మనబడి పాఠశాలల కింద మంజూరైన గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీలో నింపేంత వరకు విద్యా వాలంటీర్లను నియమించలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ప్రతినెల 01న చెల్లించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా బాధ్యులు రాంకోటి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవేందర్, శంకర్ మండల నాయకులు వీరన్న, యాకయ్య ,బాబురావు, భద్రు నాగేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలో ఫీజులు నియంత్రించాలి.

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ డిమాండ్.**

**ముదిగొండ మే 29(ప్రజా జ్యోతి) :** అనుమతులు లేకుండా అడ్మిషన్ చేస్తున్న ప్రవేట్ పాఠశాలపై తగినచర్యలు తీసుకొని ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ముదిగొండ ఇన్చార్జ్ తాసిల్దార్ టీ కరుణాకర్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం వినతపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 విద్య హక్కు చట్టం ప్రకారం ఎస్సీ ఎస్టీ, బిసి విద్యార్థులకు 25% ఉచిత విద్యను అందించాలన్నారు.వచ్చే నెలలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని,ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టే విధంగా ఫీజులలో నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చే అమలు చేయాలన్నారు.మండలంలో అనుమతులు లేకుండా కొన్ని ప్రవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అడ్మిషన్ చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం,భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫీజులు వసూలు చేయటంలో ప్రైవేటు విద్యాసంస్థలు అడ్డు అదుపు లేకుండా పేచ్చిమీరి పోతున్నారన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులను జలగల పిడుస్తున్నారని ఆయన విమర్శించారు. ఈసంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల దగ్గర నుండి స్టడీస్ సర్టిఫికెట్,టిసి ఇవ్వటానికి అధిక శాతం ఫీజు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.విద్య హక్కు చట్టాన్ని అమలు చేయని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలలో యూనిఫామ్,,నోట్ బుక్స్ విక్రయాలను నిషేధించాలని పోనుకుల సుధాకర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు: జిల్లా కమిటీ సభ్యుడు బోడ వెంకట్, మండల నాయకులు బోళ్ల నాగరాజు,నాగచైతన్య, టి చరణ్,జాకీర్ హుస్సేన్,గురుబ్రహ్మాచారి,రవీందర్ పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**కూసుమంచి మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి**

**కూసుమంచి మే29 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలోని కూసుమంచి ,పాలేరు కోక్యాతండా, చౌటపల్లి మొదలగు గ్రామాలలోని విత్తన దుకాణాలను కూసుమంచి మండల వ్యవసాయ అధికారిని రామడుగు వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన వ్యాపారులందరూ చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. రైతులకు ఇచ్చే బిల్లు మీద వారి పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని లాట్ నెంబర్లను సరి చూడాలని, రైతు వారీగా విత్తన విక్రయాలను రిజిస్టర్ లో పొందుపరచాలని, ఇటువంటి రిజిస్టర్ లను ప్రతిరోజు తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు విత్తనాలు అమ్మిన రిపోర్టును సమర్పించాలని, రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, స్టాక్ బోర్డు మరియు ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఏ డీలర్ అయినా ఎం ఆర్ పి కన్నా అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం వస్తే విత్తన చట్ట ప్రకారం వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలే కొనుగోలు చేయాలి

**కూసుమంచి మండలం వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి**



**కూసుమంచి మే29 ప్రజా జ్యోతి:** వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలే కొనుగోలు చేయాలని కూసుమంచి మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల విత్తనాలు కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైనందును రైతులు విత్తనాలు ఎంపిక విత్తనాలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. రైతులు విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు డీలర్ వద్ద విత్తనాలకు సంబంధించిన రసీదును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తన్న ప్యాకెట్లు బిల్లును భద్రంగా దాచుకోవాలి. లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయరాదని రైతులకు సూచించారు.

# ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విపి గౌతమ్






**ఖమ్మం ప్రతినిధి మే 29 ప్రజా జ్యోతి:** లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 4న ఉదయం 8 గంటలకు ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల నందు ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తుంచుకోవాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ లో మాత్రం 18 టేబుళ్లు ఏర్పాటు ఉంటుందని, ప్రతి టెబిల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్



లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ పూర్తిగా చెక్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్ యొక్క పింక్ సీల్, గ్రీన్ ఫీల్డ్ చెక్ చేసి కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలని, కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్ ను సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ అన్నారు. కంట్రోల్ యూనిట్ లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని, కంట్రోల్ యూనిట్ లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని అన్నారు. కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, టేబుల్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు సహాయ రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వివి ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవు తుందని, వివి ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ.టి.పి.బి.ఎస్ విధానం ద్వారా సర్వీస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారులు, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శిక్షణ ఇవిఎం యంత్రాలతో మాక్ కౌంటింగ్ నిర్వహించి, కౌంటింగ్ ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి. సత్యప్రసాద్, జి. గణేష్, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీవో సన్యాసయ్య, శిక్షణ నోడల్ అధికారి కె. శ్రీరామ్, సహాయ శిక్షణ నోడల్ అధికారి మదన్ గోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు.

**ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి.**



**ముదిగొండ మే 29(ప్రజా జ్యోతి) :** సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి చెప్పారు. ముదిగొండ సొసైటీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వము అందిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ముదిగొండ సొసైటీలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.పచ్చిరొట్ట విత్తనాలు జిలుగు,జనుము విత్తనాలు పంట భూముల భూసారం పెంచుకునేందుకు రైతులు ఉపయోగించుకోవాలన్నారు.జీలుగు 30 కేజీల బస్తా రూ1116 ,జనుము,40 కేజీల బస్తా రూ1448 ధర ఉందని,పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పొలం పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తో,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి కూపన్ తీసుకొని సొసైటీలో విత్తనాలను పొందవచ్చున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను అందజేస్తుందని,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సొసైటీ చైర్మన్ యలగొండస్వామి అన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు.

**మండల వ్యవసాయ అధికారిణి ఎం రాధ హెచ్చరిక.**

**ముదిగొండ మే 29(ప్రజా జ్యోతి) :** రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారిణి మందుల రాధ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. మండల కేంద్రమైన ముదిగొండలో బుధవారం పలు ఎరువుల దుకాణాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాల,స్టాక్ వివరాలు తెలుసుకొని రికార్డులను పరిశీలించారు.ప్రతి ఎరువుల దుకాణంలో రికార్డు నమోదు తప్పనిసరి ఉండాలన్నారు.విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు.నకిలీ విత్తనాలు విక్రయిస్తే,ఎరువుల దుకాణం సీజ్ చేయడంతోపాటు,కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ఎం రాధ చెప్పారు.

